**గమనిక:** సాహిత్య పేజీ 'చెలిమె' ఇకపై ఆదివారానికి బదులు సోమవారం ప్రచురితమవుతుంది.



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# పంచన్యాయాలు కాదు, వంచనా శిల్పమే!



వై.సతీష్‌రెడ్డి
96414 66666

**ఒకానొకప్పుడు ఓ రాజ్యంలో ఒక రాజుండేవాడు. ఆయనకు సంగీతం అంటే మక్కువ. మంచి సంగీతంతో కూడిన పాట పాడినవారికి వెయ్యి వరహాలు ఇస్తానని చాటింపు వేయించాడు. ఓ సంగీత విద్వాంసుడు రాజు దగ్గరకు వచ్చి, పాటలు పాడాడు. రాజు సంతోషపడ్డాడు. ఆ ఆనందంలో గాయకునికి 500 వరహాలు ఇస్తున్నట్టు చెప్పాడు. గాయకుడు రెట్టించిన ఉత్సాహంతో మరో పాట పాడాడు.**

ఈ సారి రాజు ఓ వజ్రాలహారం ఇస్తానని ప్రకటించాడు. గొంతు సవరించుకొని మరింత ఉత్సాహంతో గాయకుడు మరో పాటందుకున్నాడు. ఈ సారి అర్ధరాజ్యం ఇస్తున్నట్టు ప్రకటించాడు రాజు. పాటలు ముగిసిన తర్వాత గాయకుడు తనకు ప్రకటించిన వరహాలు, వజ్రాలహారం, అర్ధరాజ్యం ఇచ్చేస్తే వెళ్లిపోతానని రాజును కోరుతాడు. అప్పుడు రాజు.. 'మీరు నాకు శ్రవణానందం కలిగించారు. నేను కూడా మీకు శ్రవణానందం కలిగించాను. ఇక్కడ ఇచ్చేది లేదు. పుచ్చుకునేది లేదు' అని చెప్పి గాయకుడిని రాజదర్బార్ నుంచి వెలేశాడు.

లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రకటించిన మ్యానిఫెస్టో చూస్తే పై రాజుగారి కథ గుర్తుకువస్తున్నది. ఎందుకంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో లెక్కకు మించిన హామీలిచ్చింది. ఇప్పుడు సాకులు చెప్తూ ఆ హామీలను తప్పించుకుంటున్నది. కొన్ని హామీలైతే అసలు తాము చేస్తామని చెప్పలేదని కుండబద్దలు కొట్టేసింది. తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకే దిక్కు లేదంటే, ఇప్పుడు కొత్తగా పంచన్యాయాలు అంటూ లోక్‌సభ మ్యానిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్ర ప్రజలను మోసం చేసినట్టే దేశ ప్రజలకు కూడా పంచన్యాయాల పేరిట పంగనామాలు పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది.

'దోచుకో.. దాచుకో..' అనేది కాంగ్రెస్ పార్టీ నినాదం. అంతే తప్ప, వాళ్లకు మరో ధ్యాస ఉండదు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన పది రోజుల్లోనే కాంగ్రెస్ మాట మార్చేసింది. రాష్ట్రంలోని ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని స్వయంగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలే ప్రకటించారు. కానీ, ఎన్నికల్లో గెలిచాక అసలు తాము నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదని ఆన్ రికార్డ్ అసెంబ్లీలో అబద్ధమాడారు. యువ వికాసం అని చెప్పి దాన్ని యువతను మోసం చేసే స్కీంగా మార్చేశారు. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగాల జాతర అని జాబ్ క్యాలెండర్ ఇచ్చారు. అందులో ఒక్కటి కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. అంటే తెలంగాణ నిరుద్యోగులను మోసం చేసినట్టే దేశవ్యాప్తంగా నిరుద్యోగులను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతున్నదని అర్థమవుతున్నది. పైగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను తాము ఇచ్చామని చెప్పుకొంటున్నారు. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని డబ్బా కొట్టుకుంటున్నారు. ఆఖరికి తెలంగాణలో టెట్ పరీక్షకు రూ.200 ఉన్న ఫీజును రూ.2000కు పెంచి, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పరీక్ష ఫీజులు ఉండవని డాంబికాలు ప్రకటిస్తున్నారు.

ఈ పంగనామాల ఎపిసోడ్ ఇంతటితో ఆగిపోలేదు. ఇది ఆరంభం మాత్రమే. ఎందెందు వెదికినా అందందు కలదన్నట్టు.. కాంగ్రెస్ పార్టీ అన్నింటిలోనూ పంగనామాలు పెట్టింది, పచ్చి మోసాలు చేసింది. అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నది. ఇప్పటివరకు దానికి అతీగతీ లేదు. కానీ.. కొత్తగా ప్రకటించిన లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలో దేశమంతటా మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించింది. అంటే ఒక్కో మహిళకు నెలకు రూ.8000కు పైగా రావాలి. ఈ లెక్కన మన రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ.10,500 రావాలి. కానీ ఇప్పటికీ రూ.2500కే దిక్కులేదు. అలాంటప్పుడు ఇంకా రూ.8000 ఇస్తారంటే ప్రజలు ఎలా నమ్మాలి?

వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిమహిళల పింఛన్ రూ.4000కు పెంచుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్, గెలిచి గద్దెనెక్కాక పాత పింఛన్ వస్తే చాలనుకునే పరిస్థితికి తీసుకొచ్చింది. రైతులనైతే నిండా ముంచారు. ఏటా ఎకరానికి రూ.15,000 రైతుభరోసా పేరుతో ఇస్తామన్నారు. కానీ, గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10,000 రైతుబంధు డబ్బులు కూడా ఇంకా ఖాతాల్లో జమకాని దుస్థితి. అడిగితే స్వయంగా మంత్రులే చెప్పుతో కొడతామనే దాకా పోయింది. రైతు రుణమాఫీది మరో గోస. ఎన్నికల నాటికి అప్పు కట్టేసిన రైతులు వెళ్లి వెంటనే తెచ్చుకోవాలని డిసెంబర్ 9న మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆయన ముఖ్యమంత్రి అయి నాలుగు నెలలవుతోంది. ఇప్పటికీ రుణ



మాఫీ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగానే ఇప్పుడు దేశమంతటికి ఖర్గే, రాహుల్‌గాంధీ ఇదే రుణమాఫీ హామీ ఇచ్చారు. ఇది అమలయ్యేదేనా అనేది తెలుసుకోవడానికి మన రాష్ట్రమే మంచి ఉదాహరణ.


అంతేకాదు, పంటలకు మద్దతు ధర ఇస్తామని, వరికి రూ.500 బోనస్ ఇస్తామని ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మద్దతు ధర సంగతి దేవుడెరుగు.. బోనస్ గురించి అడిగితే ఆ మాట తాము అననే లేదని దాటవేస్తున్నారు. మళ్లీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలుచేస్తామని చెప్తుండటం గమనార్హం. వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నా, నీళ్లు లేక పంటలు ఎండుతున్నా.. ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ రైతుల పొలాలకు వెళ్లి పరామర్శించటం లేదు. కనీసం, వారికి నష్టపరిహారం ప్రకటించలేదు. అడిగితే రైతుల మీద, రైతుల ఆత్మహత్యల మీద ముఖ్యమంత్రి వెటకారాలు చేస్తున్నారు. ఇలాంటి పార్టీ దేశంలో ఉన్న రైతులకు ఇస్తున్న హామీలను ఎలా విశ్వసిస్తాం?

> **రైతుల విషయంలో పూటకో మాట మాట్లాడుతుండటంతో రైతుల్లో భరోసా లేకుండా పోయింది. వారికి గుండెధైర్యాన్ని ఇచ్చేవారు లేక కాంగ్రెస్ సర్కారు వచ్చిన ఈ నాలుగు నెలల్లో 200కు పైగా రైతులు ప్రాణాలు తీసుకున్నారు. ఇంత జరిగినా కాంగ్రెస్ సర్కారుకు కనికరం లేదు.**

ఆరు గ్యారెంటీల్లో ఒక్కటంటే ఒక్క హామీ కూడా పరిపూర్ణంగా అమలైంది లేదు. ఎన్నికల ముందు ప్రతీ ఇంటికి రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత రేషన్ కార్డు ఉంటేనే ఇస్తామని మాట మార్చారు. చివరికి రేషన్‌కార్డు ఉన్నవాళ్లలో సగం మందికి కూడా ఇవేవీ రావడం లేదు. 90 లక్షలకు పైగా రేషన్ కార్డులుంటే 40 లక్షల మందికి మాత్రమే 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నారు. రూ.500 సిలిండర్ అందుకుంటున్న వారి సంఖ్యలో అందులో సగం కూడా లేదు. ఒక పథకం అందుకుంటే మరో పథకంలో లబ్ధిదారులుగా లేకుండా జాగ్రత్త పడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది.

చివరగా అత్యంత దారుణమైన విషయం ఏమంటే.. సామాజిక న్యాయం చేస్తామని కొత్త మ్యానిఫెస్టోలో పెట్టారు. కానీ, దళితబిడ్డ అయిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సాక్షాత్తు గుడిలో కింద కూర్చోబెట్టి అవమానించారు. మరో దళిత నాయకుడు బక్క జడ్సన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో బహుజన బిడ్డలకు గౌరవం లేదని అనేకమంది నాయకులు బాహాటంగానే చెప్తున్నారు. అలాంటి పార్టీ సామాజిక న్యాయం చేస్తామని చెప్పడం... నేతి బీరకాయలో నెయ్యి మాదిరిగానే ఉన్నది. ఇక్కడ మరో విషయం ఏమంటే.. పదేండ్లలో కార్పొరేట్లకు తప్ప, కామన్ మ్యాన్‌కు పైసా పనిచెయ్యని నరేంద్ర మోదీ 100 లక్షల కోట్ల అప్పు తెచ్చారు. మరి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వాళ్లు ఎన్ని లక్షల కోట్ల అప్పు తీసుకురావాలి? ఇందులోని మోసాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇలా.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను పోల్చిచూస్తే మోసం తప్ప మరేం కనిపించడం లేదు. అలవిగాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టడం, అధికారం చేజిక్కిన తర్వాత నట్టేట ముంచడం కాంగ్రెస్‌కు అలవాటే. తరాలు మారినా కాంగ్రెస్ బుద్ధి మాత్రం మారడం లేదు.

(వ్యాసకర్త: కన్వీనర్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం)



## మురిసినం

ధరణి మీద పంట
దశాబ్దం మురిసినం

మా ఊరి చెరువు
ఎండాకాలమైన
ఏట్లే నీరున్నట్టు
ఎండకుండా
అలుగు దుంకి
చెరువు వాగు సాగేది

చెరువెండిపోయింది
సేనెండిపోయింది
సెలకరిపోయి
గొలుకు గొలుకు అయింది

ఉత్త కళ్లపోతే
ఉడుకు దుమ్ము లేచి
కమ్మరి కొలిమై
కాలుతుంది నేల

రైతన్న మనసు
రగిలిపోతుంది
ఆగమైన రైతు
అరక బందు పెట్టే
పుష్కలమైన నీళ్లేవీ
పుసటిది పంట ఏదీ?



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

# ఈడీతో విపక్షాల పెనుగులాట



మాలోతు సురేష్
98856 79876

**ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా విరుచుకుపడుతున్న ఈడీని ఎదుర్కొనేందుకు విపక్షాలు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఆ వ్యూహాల్లో భాగంగానే ఝార్ఖండ్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏవైనా డాక్యుమెంట్లను అడిగితే.. నేరుగా వాటికి పంపించవద్దని ఆ మార్గదర్శకాల సారాంశం. రాష్ట్ర క్యాబినెట్ సెక్రెటరీ, విజిలెన్స్‌ను సంప్రదించి.. తగిన న్యాయ సలహాలు తీసుకున్న తర్వాతే స్పందించాలని ఝార్ఖండ్ ప్రభుత్వం తేల్చిచెప్పడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈడీ అనేది ఒక సమస్యగా మారడంతో దాన్ని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయనడానికి ఈ ఉదంతమే ఉదాహరణ.**

కేంద్ర దర్యాప్తు సంస్థలకు బీజేపీ సర్కార్ ఎక్కువగా పని చెప్తుండటంతో నిరూపణ కాని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అనేకమంది ప్రతిపక్ష నేతలు జైలులో మగ్గుతున్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ హయాంలో ఈడీ కేసులు గణనీయంగా పెరిగాయి. 2004-2014 మధ్యకాలంలో ఈడీ 112 కేసులు నమోదు చేయగా.. 2014-22 మధ్యకాలంలో ఈ సంఖ్య 3,010కి చేరింది. గతంతో పోలిస్తే ఇది 27 రెట్లు అధికం. మరోవైపు బీజేపీ పాలనలో రాజకీయ నేతలపై ఈడీ 121 కేసులను నమోదు చేయగా.. వారిలో 115 మంది (95 శాతం) ప్రతిపక్ష నాయకులే ఉన్నారు. అయితే కేసుల సంఖ్య భారీగా పెరిగినప్పటికీ నేర నిరూపణ రేటు మాత్రం చాలా తక్కువగా ఉండటం శోచనీయం. గడిచిన 17 ఏండ్లలో పీఎంఎల్‌ఏ చట్టం కింద 5,400 కేసులు నమోదవగా.. వాటిలో 23 మాత్రమే నిరూపితమవడం గమనార్హం.

ప్రతిపక్ష నేతలనే కేంద్ర దర్యాప్తు సంస్థలు టార్గెట్ చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విపక్షాలను బెదిరించి తమ దారిలోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. విపక్ష నేతలు అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్, అభిషేక్ బెనర్జీ, సంజయ్‌సింగ్, మనీశ్ సిసోడియా తదితరులు ఈడీ బాధితులుగా మారడం విపక్షాల ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. అదే సమయంలో అధికార బీజేపీ నేతలు, మిత్రపక్షాల వైపు ఈడీతో సహా దర్యాప్తు సంస్థలేవీ కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైగా ప్రతిపక్షంలో ఉండగా ఈడీ కేసులతో సతమతమైనవారు బీజేపీ తీర్థం పుచ్చుకోగానే, ఎన్డీయేలో చేరాక ఎటువంటి విచారణను ఎదుర్కోకపోవడం మనం చూస్తునే ఉన్నాం. హిమంత బిశ్వశర్మ, సువేందు అధికారి, జ్యోతిరాదిత్య సింధియా వైపు ఈడీ కన్నెత్తి చూడకపోవడమే అందుకు నిదర్శనం. 'నేను బీజేపీ ఎంపీని కాబట్టి ఈడీ నా వెంట పడదు' అని ఆ పార్టీ ఎంపీ సంజయ్ పాటిల్ పేర్కొన్నారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని పట్టుదలగా ఉన్న బీజేపీ.. ఇలాంటి కుట్రలకు తెరలేపిందనే వాదనలు ఉన్నాయి. ప్రతిపక్షంలోని ప్రధాన నేతలను ప్రచారానికి దూరం చేయాలన్నదే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్ తదితరుల అరెస్టులకు ఇదే కారణమని విశ్లేషకులు అంటున్నారు. అవినీతి ఆరోపణలు, ఈడీ సోదాలు, అరెస్టుల కారణంగానే తాము ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని పలువురు బాహాటంగానే చెప్తున్నారు. ఇటీవల జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే జరిగింది. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌కు రూ.508 కోట్లు బదిలీ చేసి ఉండొచ్చని ఎన్నికలకు ముందు ఈడీ బాంబు పేల్చింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రిపైనే అవినీతి ఆరోపణలు రావడంతో ఆ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ చతికిలపడింది. తాజా పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూడా బీజేపీ అదే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బీజేపీ పన్నుతున్న పద్మవ్యూహాన్ని ఛేదించేందుకు ప్రతిపక్షాలు కూడా ప్రతివ్యూహాలు రచించక తప్పడం లేదు. ఈడీని ఎదుర్కొనేందుకు విపక్ష పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కొత్త మార్గాలను వెతుకుతున్నాయి. అందులో భాగంగా ఉద్దేశపూర్వకంగానే తమపై బీజేపీ సర్కార్ ఆరోపణలు చేయిస్తున్నదని, అవినీతిపరులనే ముద్ర వేస్తున్నదని ప్రజలకు వివరిస్తున్నారు. ఆందోళనలు, నిరసనల ద్వారా రోడ్డెక్కి ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటున్నారు. దర్యాప్తు సంస్థలు అడుగుతున్న వివరాలను ఇవ్వకుండా అడ్డుకోవడం మరో వ్యూహం. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్




అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈడీ దాడులను నిరసిస్తూ కాంగ్రెస్ పేరడీ పాటలను విడుదల చేసింది. మరోవైపు సమన్లకు స్పందించకుంటే.. ఆ కారణంగా అరెస్టు చేసే అవకాశం లేకపోవడంతో కొంతమంది ఈడీ సమన్లకు స్పందించకుండా తాత్కాలికంగా తప్పించుకుంటున్నారు. సోదాలు, అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈడీని అదే పంథాలో ఎదుర్కోవడం మరో వ్యూహం. ప్రధానంగా విపక్ష పార్టీలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. లంచం తీసుకున్నారనే ఆరోపణలపై రాజస్థాన్‌లో ఈడీ అధికారిని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అదుపులోకి తీసుకున్నది. తమిళనాడులోని మదురైలో ఉన్న ఈడీ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సోదాలు చేయడం అందులో భాగమే. మరోవైపు పశ్చిమబెంగాల్‌లో ఓ టీఎంసీ నేత ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఈడీ అధికారులపై ఓ మూక దాడికి పాల్పడటం దుమారం రేగింది.

> **విపక్ష పాలిత రాష్ట్రాలు అనుసరిస్తున్న ఈ వ్యూహాలు సరైనవేనా? అంటే, నిస్సహాయ స్థితిలో అలా చేయడం తప్ప వాటికి వేరే దారి కనిపించడం లేదనేది నూటికి నూరు పాళ్లు నిజం. అయితే ఎన్ని ప్రణాళికలు రచించినా విపక్ష నేతల అరెస్టులు మాత్రం తప్పడం లేదు.**

ఈడీ దాడులతో బెంబేలెత్తుతున్న ప్రతిపక్షాలు ఆ అంశాన్ని అనేక వేదికలపై ప్రస్తావిస్తున్నాయి. పార్లమెంట్‌లో ఆందోళన చేసినా, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసినా, ప్రధాని, రాష్ట్రపతి, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకుపోయినా ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదు. ఈ పరిస్థితిపై ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తం చేశారు. 'రాష్ట్రాల్లో సీబీఐ విచారణ చేపట్టేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఈడీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అటువంటి అధికారం లేకపోవడంతో విపక్షాలు ఏమీ చేయలేకపోతున్నాయి' అని ఆయన వాపోయారు. 2015-23 మధ్యకాలంలో విపక్ష పాలిత 10 రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో సీబీఐ విచారణకు కావాల్సిన సాధారణ సమ్మతిని ఉపసంహరించుకోవడం గమనార్హం.

ప్రతిపక్ష నేతల అరెస్టులతో అధికారం చేజిక్కుతుందా? అంటే చెప్పలేని పరిస్థితి. కానీ, అరెస్టుల వల్ల ప్రతిపక్షాలు బలహీనపడతాయన్నది వాస్తవం. దాంతో పాటు అధికార పక్షం మరింతగా ప్రచారంలో దూసుకుపోయేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అందుకు తాజా ఉదాహరణ బంగ్లాదేశ్ ఉదంతం. వందల మంది ప్రతిపక్ష నేతలను అరెస్టు చేసి జైలు పాలు చేసిన షేక్ హసీనా ఎన్నికల్లో సునాయాసంగా గెలుపొందారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరిగిన బంగ్లా ఎన్నికల తీరును అమెరికా సహా అనేక దేశాలు ఖండించాయి. కానీ, భారత్ మాత్రం మౌనం వహించింది.

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై పలు దేశాలు విమర్శలు గుప్పించినప్పటికీ.. 'ఇది మా అంతర్గత విషయం' అంటూ బీజేపీ సర్కార్ తెలివిగా తప్పించుకున్నది. అయితే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ప్రజాస్వామ్యమే కనుమరుగయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ఈ తరుణంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే బాధ్యత ఇప్పటికీ ప్రజలపైనే ఉన్నదనే విషయాన్ని మరువరాదు.




## బీజేపీ నేతలపై చర్యలేవీ?

ప్రతిపక్ష నేతలను అరెస్టు చేసేందుకు సీబీఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలను బీజేపీ వాడుకుంటున్నది. వాటి వెనుక దాక్కోవడం మానేసి.. బీజేపీ ఎన్నికల్లో పోరాడాలి. ఆరోపణలు రాగానే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తున్న ఈడీ.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేతలపై ఏం చర్యలు తీసుకున్నది?



- ఆతిశీ, ఢిల్లీ విద్యాశాఖ మంత్రి

# భారత్ బాయ్‌కాట్

**ఉన్నట్టుండి బంగ్లాదేశ్‌లో 'బాయ్‌కాట్ భారత్?' నినాదం ఊపందుకున్నది. ఈ నినాదానికి మద్దతుగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులను కొనవద్దని, వాడవద్దని బంగ్లాదేశ్ ప్రజలను ప్రోత్సహిస్తున్నారు. నిన్నమొన్నటి దాకా భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించిన బంగ్లా ఉన్నట్టుండి వ్యతిరేకత దిశగా పయనిస్తున్నది. కారణాలేమైనా భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బంగ్లా అవలంబిస్తున్న తీరు అధికార బీజేపీపై ఎటువంటి ప్రభావం చూపిస్తుందోనన్న ఆందోళన ఇప్పుడు వ్యక్తమవుతున్నది. అసలు బంగ్లాలో భారత్‌కు వ్యతిరేక పరిస్థితులకు దారితీసిన కారణాలేమిటో చూద్దాం.**



వి.వి.వెంకటేశ్వరరావు
63008 66637

2024 జనవరిలో జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ బంగ్లాదేశ్‌లో ఐదోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రధానిగా షేక్ హసీనా మరోసారి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె అధికారంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియా వేదికగా మొదలైన ఈ ప్రచారం మరింత ఊపందుకున్నది. ఇప్పుడు ఆ స్లోగన్ ఒక ఉద్యమంగా మారింది. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటున్నదని, తమ సొంత ప్రయోజనాల కోసమే షేక్ హసీనాను మళ్లీ ప్రధానిగా చేశారంటూ ఐరోపా, అమెరికాలో ఉంటున్న ప్రవాస బంగ్లాదేశీయులు ఈ ప్రచారాన్ని మొదలుపెట్టారు. బంగ్లాదేశ్ ఉనికికి కారణం భారతదేశం. వారి ఆశలకు, ఆకాంక్షలకు తగ్గట్టు బంగ్లాదేశ్‌ను ఏర్పాటుచేసిన భారత్ అంటే.. ఆ దేశీయుల్లో ప్రత్యేకమైన అభిమానం ఉన్నదన్న సంగతి అందరికీ తెలిసిందే. భారత్‌తో కలిసి ఎక్కువ భూ సరిహద్దులు కలిగి ఉన్న ఈ దేశం వాణిజ్య అవసరాల కోసం భారత్‌పైనే ఆధారపడుతున్నది. అంతేకాదు.., భారత్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన దేశంగా పేరున్నది. అలాంటి దేశంలో ఇప్పుడు కొత్తగా 'బాయ్‌కాట్ భారత్' అన్న నినాదం ప్రారంభం కావడమే కాదు, అంతకంతకూ విస్తరిస్తున్నది. దీనికి కారణమేమిటి? దీని వెనుక ఉన్నదెవరు? ఇప్పుడే ఈ వ్యవహారం తెరమీదికి రావడానికి కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలను పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు తెలుస్తున్నాయి.

సోషల్ మీడియా వేదికగా ప్రారంభమైన ఈ దుష్ప్రచారానికి మద్దతుగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులను కొనవద్దని, వాడవద్దని బంగ్లాదేశ్ ప్రజలను ప్రచారకులు కోరుతున్నారు. ప్రస్తుతం పారిస్‌లో ఉంటున్న బంగ్లాదేశీ వైద్యుడు పినాకీ భట్టాచార్య ఈ ఆన్‌లైన్ ఉద్యమానికి తెర తీసినట్టుగా తెలుస్తున్నది. ప్రవాసీ బంగ్లాదేశీయుల పిలుపుతో బంగ్లాలోని కొన్ని వర్గాలు ఈ నినాదానికి తమ మద్దతు తెలియజేయడంతో అక్కడి ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) దీన్ని రాజకీయాస్త్రంగా మార్చుకున్నది.

'బాయ్‌కాట్ భారత్' నినాదాన్ని అందిపుచ్చుకొని ప్రధాని షేక్ హసీనా భారత్ అవసరాల కోసమే పనిచేస్తున్నట్టుగా ప్రచారాన్ని షురూ చేశారు. తమ వాదనకు బలం చేకూరేలా వారు కొన్ని వాదనలను వినిపిస్తున్నారు. అందులో ముఖ్యమైనది తాజాగా ముగిసిన బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు. ఇవి అత్యంత వివాదాస్పదమైనవిగా ముద్రపడ్డాయి. ఎన్నికలను ప్రతిపక్షాలు బహిష్కరించడంతో హసీనా ప్రధానిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఆమె విజయం సాధించారన్న వార్తలు వచ్చిన వెంటనే.. భారత ప్రధాని మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలుపటం, మద్దతును ప్రకటించడమే దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు.

ఇదిలా ఉంటే, బంగ్లాదేశ్‌లో 'బాయ్‌కాట్ భారత్' ఉద్యమం అక్కడి ప్రజల్లో కాకుండా రాజకీయ ఎజెండాతోనే ప్రారంభమైనట్టుగా పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం ట్రెండింగ్‌లో కొనసాగడమే తప్ప వాస్తవంగా ఈ అంశానికి బంగ్లా ప్రజల నుంచి ఎటువంటి మద్దతు లేదని కొందరు చెప్తున్నారు. 'బాయ్‌కాట్ భారత్' ఉద్యమంపై ఆ దేశ ప్రధాని షేక్ హసీనా తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులను 'బాయ్‌కాట్ చేయాలంటే ప్రతిపక్ష బీఎన్‌పీ నేతలు ముందు తమ భార్యల చీరలన్నింటినీ కాల్చేయాలి' అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.



బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల భార్యలు భారత్‌కు వెళ్లి భారీ సంఖ్యలో చీరలు కొనుగోలు చేయడం, వాటిని బంగ్లాదేశ్‌లో విక్రయించడాన్ని తాను చూశానని చెప్పిన ప్రధాని షేక్ హసీనా వాటన్నింటినీ మీరు కాల్చేస్తారా? 'భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న మసాలాలు.. ఉల్లిపాయలు.. అల్లం.. వెల్లుల్లి లాంటివి లేకుండా విపక్ష నేతలు.. వారి కుటుంబాలు తమ వంటలను తయారుచేసుకొని తినాలి' అని చురకలంటించారు. అయితే, ఇక్కడే మరో అంశాన్ని మనం ప్రస్తావించాలి. మాల్దీవుల్లోనూ భారత వ్యతిరేక నినాదంతోనే మహ్మద్ మొయిజ్జు అక్కడ అధికారంలోకి వచ్చారు. తాజాగా బంగ్లాదేశ్‌లోనూ ఇదేతరహా వ్యూహాన్ని కొంతమంది భారత వ్యతిరేకశక్తులు అమలు చేయడానికి సిద్ధమైనట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఇదిలా ఉంటే రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు 50 వేల టన్నుల ఉల్లిగడ్డలను పంపాలని భారత్ నిర్ణయించడం గమనార్హం.